క్లుప్తంగా

రేపటి నుంచి రైతుసంఘం శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న దంభోళం శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 29, 30, 31వ తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రైతు సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులకు 26 జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రైతుసంఘం నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగంపై అవలంబిస్తున్న వ్యతిరేక వైఖరిపై తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు,సురేంద్రయాదవ్, పుల్లన్న, దొడ్డిపాడు మహ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళలు చైతన్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): మహిళలు చైతన్యమై తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు దిగాలని శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మల సూచించారు. శనివారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్‌తో కలిసి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో మహిళల అభివృద్ధి కోసం ఎలాంటి కేటాయింపులు లేవన్నారు. దేశంలో ఎక్కడ చూసినా మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. సమావేశంలో నాయకురాళ్లు అరుణ, పీఎస్ సుజాత పాల్గొన్నారు.

నివాళి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరానికి చెందిన ప్రముఖ బిల్డర్, యుకాన్ ప్లాజా అధినేత ఇస్మాయిల్‌బేగ్ మృతికి సీపీఎం నివాళి అర్పించింది. శనివారం ఆయన మరణ వార్త తెలుసుకున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, అవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ తదితరులు ఇస్మాయిల్ మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రేపు ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని ఇన్‌చార్జ్ కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలకు సంబంధించిన ఏవైనా సమస్యలుంటే నేరుగా అర్జీలను అందజేయవచ్చన్నారు.

30న విలువిద్య పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 30న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి విలు విద్య ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విలు విద్య సంఘం కార్యదర్శి కె.నాగరత్నమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-10, అండర్-14, అండర్-17 జూనియర్లు, సీనియర్ల విభాగంలో బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు. ప్రవేశ రుసుం రూ.100 చెల్లించాలని, వివరాలకు 93938 55460 సంప్రదించాలని తెలిపారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు

నామినేషన్ల ఉపసంహరణ

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పి.షాషావలీ, షేక్ అహమ్మద్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. శనివారం స్థానిక నగరపాలకలో మేనేజర్ చిన్న రాముడు, కార్యదర్శి నాగరాజులకు ఉపసంహరణ పత్రాలు సమర్పించారు.

కేంద్రీయ విద్యాలయంలో విద్యా వారోత్సవం



మొక్కలతో విద్యార్థులు

కర్నూలు (సిటీ): స్థానిక కేంద్రీయ విద్యాలయంలో శనివారం విద్యా వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని, కోఆర్డినేటర్ రంగన్న, పీఈటీ వజ్రరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలేయం.. కలవరం!

- ఏటా పెరుగుతున్న కామెర్ల వ్యాధి (హెపటైటిస్) కేసులు
- కేంద్ర ప్రభుత్వ సాయంతో ఉచితంగా మందులు
- జిల్లాలో 485 హెపటైటిస్-బి, 733 హెపటైటిస్-సి రోగులకు మందుల పంపిణీ
- ఆల్కాహాల్, కలుషిత నీరు, ఆహారం కారణం
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో వారంలో ఆరు రోజుల పాటు ఓపీ సేవలు
- అత్యాధునిక పరికరాలతో వైద్యచికిత్స
- నేడు వరల్డ్ హెపటైటిస్ డే



కాలేయం

కర్నూలు(హాస్పిటల్): మన శరీరంలో కాలేయం అతి ముఖ్యమైన అవయవం. దీనిని తరచూ వేధించే వైరస్‌లు హెపటైటిస్. ఇందులో ఏ, బీ, సీ, ఈ అనే నాలుగు రకాలున్నాయి. వీటిలో ఏ, ఈ ఇన్‌ఫెక్షన్ల వల్ల సాధారణ కామెర్లు వస్తాయి. ఇవి చాలా వరకు వాటంతవే తగ్గిపోతాయి. కానీ బీ, సీ వైరస్‌లు మాత్రం ప్రమాదకరమైనవి. ఇవి సమాజంలో 3 నుంచి 4 శాతం మందిని తీవ్రంగా కలవర పెడుతున్నట్లు వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 28న వరల్డ్ హెపటైటిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

హెపటైటిస్-బి వైరస్

హెపటైటిస్-బి వైరస్ వచ్చిన వారిలో ప్రాథమికంగా పెద్దగా లక్షణాలేమీ కనిపించవు. కొందరిలో కళ్లు, చర్మం పచ్చబడటం, కొద్దిగా జ్వరం, అలసట వికారం, కడుపునొప్పి, కీళ్లనొప్పుల వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రాథమిక దశలో పెద్దగా మందులు అవసరం ఉండదు. ఇతర సమస్యలేమీ లేకపోతే పోషకాహారం, విశ్రాంతి తీసుకుంటే చాలు. వాంతులు, తీవ్రమైన నిస్సత్తువ, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలున్న వారికి మాత్రం రక్తనాళం ద్వారా ద్రవాలు ఇవ్వాల్సి ఉంటుంది. దాదాపు 90 శాతం మందిలో వైరస్ కూడా దానంతటదే తొలగిపోతుంది. కొందరిలో దీర్ఘకాలిక సమస్యగా మారుతుంది. కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారుతుంది. ఇతరులు ఉపయోగించిన సిరంజిలు, బ్లేడ్లు, టూత్‌బ్రష్‌లు వంటివి వాడే వారికి బి వైరస్ సోకుతుంది. దీనికి టీకా అందుబాటులో ఉంది.

హెపటైటిస్-సి వైరస్

హెపటైటిస్-సి వైరస్‌లోనూ తొలిదశలో లక్షణాలేమీ కనిపించవు. ఫ్లూ జ్వరం, అలసట, వికారం, కామెర్ల లక్షణాలు, కీళ్లనొప్పులు, ఆందోళన, కడుపునొప్పి, ఆకలి లేకపోవడం వంటివి ఉంటాయి. ఇది చాలా మందిలో దీర్ఘకాలిక ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. కొందరిలో ఐదేళ్లలోనే కాలేయ సమస్యగా తలెత్తవచ్చు. కొందరికి కాలేయం గట్టిపడటం వంటి తీవ్ర సమస్యలు తలెత్తటానికి 20 ఏళ్లకు పైగా పట్టే అవకాశం ఉంది. కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారవచ్చు. ఈ వైరస్ కూడా రక్తం ద్వారానే వ్యాప్తి చెందుతుంది. కాబట్టి రక్తమార్పిడి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ వ్యాధికి చికిత్స కంటే నివారణే ప్రధానం.

పెద్దాసుపత్రిలో ఉచితంగా మందులు

హెపటైటిస్-బీ, సీ వైరస్‌లతో బాధపడే వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఉచితంగా మందులు ఇస్తున్నారు. నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2020 డిసెంబర్ 21వ తేది నుంచి ఈ మందులను రోగులకు ఉచితంగా అందజేస్తోంది. సాధారణంగా బి వైరస్ వారు మందులు ప్రైవేటుగా కొనాలంటే నెలకు రూ.1,400 చొప్పున ఏడాదికి రూ.16,800, సి వైరస్ వారికి నెలకు రూ.15 వేల చొప్పున మూడు నెలల పాటు రూ.45 వేలు ఖర్చవుతుంది. ఇంత ఖరీదు చేసే మందులన్నీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగానే ఇస్తున్నారు. వ్యాధి పూర్తిగా తగ్గాలంటే వైద్యుల సూచన మేరకు కోర్సు వాడాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు హెపటైటిస్ సి వైరస్ ఉన్న వారికి 733 మందికి, బీ వైరస్ వారికి 485 మందికి ఇక్కడ మందులు ఇచ్చారు. ఈ మందులు మధ్యలోనే ఆపేస్తే అది కాలేయం ఫెయిల్యూర్ అయి లివర్ సిర్రోసిస్‌కు దారి తీస్తుంది.

పెరుగుతున్న కాలేయ వ్యాధిగ్రస్తులు



ఇటీవల కాలంలో కాలేయ వ్యాధులతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో హెపటైటిస్‌లో బి, సి వైరస్‌లు దీర్ఘకాలిక జబ్బులుగా మారి ప్రాణాంతకమవుతాయి. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చే వారిలో సగం మంది కాలేయ జబ్బులతోనే వస్తున్నారు. వారికి వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్నది. హెపటైటిస్ బి, సి వ్యాధిగ్రస్తులకు ఖరీదైన మందులతో పాటు ఇమ్యునోగ్లోబిన్స్‌ను సైతం ఉచితంగా అందజేస్తున్నాం. రూ.5 వేలకు పైగా ఖరీదయ్యే హెపటైటిస్ పరీక్షలు(వైరస్ లోడ్)కూడా ఇక్కడే ఉచితంగా నిర్వహిస్తున్నాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ మోహన్‌రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్ఓడీ, జీజీహెచ్, కర్నూలు

పిల్లలకు టీకాలు తప్పనిసరి



చిన్నారికి టీకా వేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఎఫ్‌సీఐ కాలనీ సచివాలయం పరిధిలోని ఐఎంఏ భవన్‌లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌కుమార్, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీ యశోదా హాస్పిటల్‌పై విచారణ జరపాలి

ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్న బాలాజీ యశోదా హాస్పిటల్‌పై సమగ్ర విచారణ జరపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌కు ఏఐవైఎఫ్ నాయకులు శనివారం వినతి పత్రమిచ్చారు. ఈనెల 3న గర్భిణికి (ఆరు నెలలు) అబార్షన్ చేశారని, దీనిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని, నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, నగర నాయకులు చంటి ఉన్నారు.

వయస్సు పెరుగుదల అనివార్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ప్రతి మనిషికీ వయస్సు పెరుగుదల అనివార్యమని, మానవ శరీరంలో మార్పులు సహజమని, అయితే మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం, రోజువారి వ్యాయామం, ఆధ్యాత్మికంతో వయస్సు పెరుగుదల ద్వారా వచ్చే సమస్యలు రాకుండా కాపాడుకుంటూ ఆరోగ్యంగా జీవించవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. శనివారం స్థానిక మెడికల్ కాలేజీలోని ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన జోనల్ సీఎంఈలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంల ఫిజియాలజీ హెచ్ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ అమీరున్నీసా బేగం, కో ఆర్డినేటర్ డాక్టర్ ఎలిజబెత్ రాణి, ఫిజియాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ రామేశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధి కల్పనపై పోరాటాలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్‌పై పోరాటాలకు సిద్ధమవుతున్నాట్లు బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పగడాల ఆనంద్‌బాబు అన్నారు. శనివారం బీసీ భవన్‌లో పోరాటాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2.35 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, ఏపీపీఎస్సీ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 నుంచి 58 ఏళ్లకు తగ్గించాలని కోరారు. పరిశోధక విద్యార్థులకు నెలకు రూ.10 వేలు ఫెలోషిప్ అందించాలని, ప్రతి విశ్వ విద్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అశోక్, బీసీ సంఘాల ప్రతినిధులు దేవపూజ ధనుంజయ ఆచారి, అయ్యన్న యాదవ్, వేంపెంట రాంబాబు, జేవీ క్రిష్ణయ్య, హేమంత్‌గౌడ్, శ్రీరామ్‌యాదవ్, రాధాక్రిష్ణ, రాజేష్, శివరాం, ప్రవీణ్‌సాయి పాల్గొన్నారు.

కర్నూలు ఇన్‌చార్జ్ ఎస్ఆర్‌గా రాఘవేంద్ర

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జాయింట్ -1 ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రకు బాధ్యతలు ఇచ్చినట్లు జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు తెలిపారు. ఇక్కడ ఎస్ఆర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ కర్నూలు పరిధిలోని జొహరాపురం రోడ్డులోని సర్వే నంబర్ 154లోని 12.59 ఎకరాల వక్ఫ్ భూమిని సర్వే నంబర్ 154/1గా వేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు నిర్ధారణ కావడంతో డీఐజీ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆయన స్థానంలో రాఘవేంద్రకు ఇన్‌చార్జ్ ఇచ్చినట్లు వివరించారు. త్వరలోనే పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్‌ను నియమిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్: కళాకారుల సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.మనోహర్‌బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజ్‌విహార్ కూడలిలో ఉన్న ఆర్టీసీ స్థలంలో విజయ భారతి పేరుతో కళామందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి కళాకారులకు మంచి కళావేదికను ఏర్పాటు చేయాలని కోరారు.



ఆల్ ది బెస్ట్

పారిస్‌లో ప్రారంభమైన ఒలింపిక్స్ పోటీలలో పాల్గొననున్న భారత క్రీడాకారులకు కర్నూలు మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు వినూత్నంగా ఆల్ ది బెస్ట్ చెప్పారు. 500 మంది విద్యార్థులు ఒలింపిక్స్ -2024 రంగుల దుస్తులు ధరించి లోగోలోని రింగ్‌ల ఆకారం, ఆల్ ది బెస్ట్ అక్షరాల ఆకారంలో కూర్చొని తమ అభిమానాన్ని చాటారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనానికి యత్నం

కర్నూలు (టౌన్): స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీవారి కుటీర్ కాలనీలో మూడు ఇళ్లల్లో దొంగలు పడ్డారు. ఇళ్లలో నివసించే వారు వ్యక్తిగత పనుల నిమిత్తం వేరే ఊళ్లకు వెళ్లారు. ఉపాధ్యాయుడుగా పనిచేసే రవి వ్యక్తిగత పని కోసం వేంపెంటకు వెళ్లాడు. అలాగే డీఎంగా పనిచేసే దస్తగిరి హైదరాబాదుకు వెళ్లారు. ఇళ్లకు తాళం వేయడంతో శనివారం తెల్లవారుజామున ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు దొంగతనానికి విఫలయత్నం చేశారు. ఎలాంటి సొత్తు దొరకలేదు. ఉదయం ఇంటికి వచ్చిన యజమానులు ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ శాఖలో వేలం

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం ఎక్సైజ్ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. బహిరంగ వేలం ద్వారా సెబ్ శాఖకు రూ.3.85 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆ శాఖ ఏఈఎస్ వినోద్‌కుమార్, సీఐ రాజేంద్ర ప్రసాద్ వెల్లడించారు.

అక్రమ తవ్వకాలపై సీరియస్

- రూ.2 లక్షలు జరిమానా

కర్నూలు (టౌన్): అక్రమ తవ్వకాలపై మైనింగ్ శాఖ మరోసారి కొరడా ఝుళిపించింది. ఈనెల 22న కర్నూలు మండలం దిన్నెదేవరపాడు వద్ద హిటాజీతో అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తుండగా సమాచారం అందుకున్న మైనింగ్ అధికారులు అక్కడికెళ్లి వడ్డె శంకర్, వడ్డె లక్ష్మిలపై కేసు నమోదు చేసి, హిటాచీని కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే నోటీసులు అందుకున్న వారు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం హిటాచీని వదిలేసి వారి నుంచి రూ.2 లక్షలు జరిమానా వసూలు చేశారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉపసంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు.

గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఏపీ హైకోర్టు సర్వీస్ రూల్స్‌ను సవరించడానికి ఈనెల 25న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హైకోర్టు సవరణకు సుప్రీం కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని, అయితే ఏపీ హైకోర్టు సర్వీస్ రూల్స్‌లో పేర్కొన్న సవరణలో సుప్రీంకోర్టు తీర్పుల దృష్ట్యా సవరించినట్లు పేర్కొనడం అన్యాయమన్నారు. సర్వీస్ రూల్స్‌ను సవరించడానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ వల్ల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో పాటు మానసిక ఆందోళనకు గురి చేస్తోందన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన సదస్సు

కర్నూలు (లీగల్): నూతన చట్టాలపై రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ప్రాసిక్యూటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయవాడ నుంచి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ప్రాసిక్యూటర్లు కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చట్టాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడే అంశాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనారాయణ, ప్రాసిక్యూటర్లు వెంకటరెడ్డి, సి.శ్రీనివాసులు, భాస్కరరావు, సుబ్బయ్య, సుస్మిత, పద్మజ, వెంకటేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలుచేయాలి

కర్నూలు(సెంట్రల్): చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు బాబు గ్యారంటీ -భవిష్యత్‌కు షూరిటీ అంటూ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో జరిగిన సమాఖ్య కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇస్తామని, ప్రతి మహిళకు రూ.1,500 ఇస్తామని, రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేల చొప్పునా, నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేవరకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. ఆయా పథకాలను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలన్నారు. లేదంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

కష్టపడే వారికే ఉద్యోగావకాశాలు

కర్నూలు సిటీ: కష్టపడే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు సులువుగా లభిస్తాయని వివిధ కంపెనీల ఐటీ హెచ్ఆర్ మేనేజర్లు అన్నారు. శనివారం రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీ వేదికగా జరిగిన ఆకర్షణ(హెచ్.ఆర్ మేనేజర్ల సమావేశం)కు అపూర్వ స్పందన లభించింది. కాలేజీ ప్లేస్మెంట్ డీన్ జస్విందర్ కౌర్ సమన్వయకర్తగా వ్యవహారించిన ఈ కార్యక్రమంలో ఇమ్మానియేలు(ఈ-ఫామ్), కృతివాసన్(ఇన్నోవేటర్), జితేందర్ సింగ్(కాగ్నిజెంట్), ప్రణీత్(బోష్), కృపాలు(డీస్నీస్టార్), సత్యదీప(ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినేస్) పాల్గొని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రవీంద్ర, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కేతు శ్రీనివాసమూర్తి, డాక్టర్ సి శ్రీనివాసరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎం గిరిధర్ కుమార్ పాల్గొన్నారు.

పశుగణనకు రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయస్థాయిలో జరిగే పశుగణనకు మొదట శిక్షణా కార్యక్రమాలు చేపట్టేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టింది. ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన చేపడుతారు. 2019లో చివరిసారిగా జరిగింది. 2024లో చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 30, 31 తేదీల్లో పశుసంవర్ధకశాఖకు చెందిన స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్‌లకు శిక్షణ ఇస్తారు. వీరు జిల్లా స్థాయిలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తారు. ఆగస్టు 6 నుంచి 9 వరకు వీరికి శిక్షణ కొనసాగుతుంది. 6, 7 తేదీల్లో కర్నూలు డివిజన్, 8, 9 తేదీల్లో ఆదోని డివిజన్‌లకు చెందిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణనిస్తారు. పశుగణనకు ఎన్యూమరేటర్లుగా వెటర్నరీ పారా సిబ్బంది, ఏహెచ్ఏలు, సూపర్‌వైజర్లుగా వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు, అసిస్టెంటు డైరెక్టర్లు వ్యవహరిస్తారు. ఆగస్టు 3వ వారం నుంచి లేదా సెప్టెంబర్‌లో పశుగణన జరుగుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

ఈరోజు

నమామి సాయి శత రుద్రీయం

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఇస్కాల సత్రం ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమితి జిల్లా అధ్యక్షులు డి.సాయిక్రిష్ణారెడ్డి, కన్వీనర్ జి.విశ్వనాథం తెలిపారు. వీఆర్ కాలనీలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఉదయం 6.30 నుంచి గంటలకు శోభయాత్ర, ప్రశాంతి పతాకావిష్కరణ, గోమాత పూజ, శ్రీ సత్యసాయి ప్రేమ తరు (మొక్కలు నాటడం), మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

'కౌసల్యా సుప్రజా రామా' ప్రదర్శన

సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'కౌసల్యా సుప్రజా రామా' సాంఘిక నాటిక ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.

సిద్ధ సమాధి యోగ

రిషి ప్రభాకర్ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు సిద్ధ సమాధి యోగ (ఎస్ఎస్‌వై) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భాస్కర్ రెడ్డి, పుల్లారెడ్డి తెలిపారు. వాసవీ నగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, సాయంత్రం 6 గంటలకు బీక్యాంప్ మున్సిపల్ యూపీ స్కూల్‌లో ఉచిత పరిచయ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 89196 01264, 99636 28731 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అన్యాయం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శులు ఈ.భూషణం, కె.భాస్కర్ ఆరోపించారు. శనివారం న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర కేటాయింపులు చేశారన్నారు. కనీసం 10 శాతం బడ్జెట్‌ను కేటాయించాలని కోరుతున్నా పట్టించుకోకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అఖండ, నాయకులు మహేంద్ర, రమణ, రామకృష్ణనాయుడు, నరసింహారెడ్డి, మల్లికార్జున, నరేష్ పాల్గొన్నారు.